జలాల్‌పూర్‌- తిర్మన్‌పల్లి రోడ్డుకు మోక్షమెప్పుడో?

- అసంపూర్తి రోడ్డుతో రైతులకు దూరభారం
- గుండారం మీదుగా 15 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి
- ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలంటున్న రైతులు


తిర్మన్‌పల్లి నుంచి జలాల్‌పూర్‌ వెళ్లే దారి

నిజామాబాద్‌ రూరల్‌ : మండలంలోని తిర్మన్‌పల్లి, జలాల్‌పూర్‌ రోడ్డు పనులతో ఖానాపూర్‌ ఎక్స్‌ రోడ్డు బైపాస్‌ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత రూరల్‌ ఎమ్మెల్యే భూపతి రెడ్డి 2014లో తిర్మన్‌పల్లి- జలాల్‌పూర్‌ రోడ్డు నిర్మాణానికి రూ. 1.22 కోట్లు కేటాయించారు. ఆ తర్వాత భూపతి రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో రోడ్డుకు భూములిచ్చేందుకు రైతులు నిరాకరించడంతో పనులు ఆగిపోయాయి. జలాల్‌పూర్‌- తిర్మన్‌పల్లి రోడ్డు పనులు పూర్తయితే నవీపేట్‌కు వెళ్లాలంటే దాదాపు 15 కిలోమీటర్లు దూరం తగ్గేది. రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పాలవుతున్నారు. తిర్మన్‌పల్లి శివారులో జలాల్‌పూర్‌ గ్రామం అంటూ బోర్డు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఆ మార్గంలో రోడ్డు ఉందనుకొని వెళ్తున్నారు. తీరా కొంత దూరం పోయాక రోడ్డు లేదని గ్రహించి ప్రయాణికులు వెనుదిరుగుతున్నారు. ఇంకా 8 కిలోమీటర్ల రోడ్డు పనులు నిలిచిపోయాయి.

ఇటీవల రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి..తిర్మన్‌పల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి విచ్చేయగా ఈ రోడ్డు గురించి రైతులతో మాట్లాడారు. రోడ్డు పనులు త్వరలోనే పూర్తి చేయిస్తానని అన్నారు. నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి స్వగ్రామం రేకులపల్లి.

నిత్యం రాకపోకలు..

ఖానాపూర్‌ రోడ్డు మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. ముందే ఆ ప్రాంతం మొత్తం రైస్‌ మిల్లుల దుమ్మూధూళితో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖానాపూర్‌ రోడ్డు నుంచి బైపాస్‌ రోడ్డు పూర్తి అయితే ప్రయాణికులకు తిప్పలు తప్పుతాయని స్థానికులు అంటున్నారు.

దూరభారం తగ్గుతుంది



తిర్మన్‌పల్లి నుంచి జలాల్‌పూర్‌ వెళ్లే రోడ్డు పూర్తయితే రైతులకు దూరభారం తగ్గుతుంది. రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. తిర్మన్‌పల్లి నుంచి జలాల్‌పూర్‌ వెళ్లాలంటే గుండారం మీదుగా దాదాపు 15 కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు వెంటనే ఈ రోడ్డు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

– రాంరెడ్డి, జలాల్‌పూర్‌

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



తిర్మన్‌పల్లి నుంచి జలాల్‌పూర్‌ వరకు దాదాపు 3 కిలోమీటర్లు ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. కొంత మేర పనులు చేసి వదిలేశారు. కొందరు రైతులు అభ్యంతరం చెప్పడంతో పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే చొరవ తీసుకుని రోడ్డు పూర్తయ్యేలా చూడాలి.

– నాగిరెడ్డి శ్రీనివాస్‌ రెడ్డి, మాజీ సర్పంచ్‌, తిర్మన్‌పల్లి

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

- అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

సుభాష్‌నగర్‌: ఆధ్యాత్మిక సేవారంగాల్లో, సంపద సృష్టించడంలో ముందంజలో ఉన్న ఆర్యవైశ్యులు రాజకీయంగా కూడా ఎదగాలని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని గుజరాతిభవన్‌లో సీతారాంనగర్‌, ఆనంద్‌నగర్‌ ఆర్యవైశ్య హౌజ్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ధన్‌పాల్‌ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్‌ అగ్రవర్ణ పేదలకు వరంలా మారిందన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో ఈ రిజర్వేషన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. వైశ్య కార్పొరేషన్‌ అభివృద్ధికి కాంగ్రెస్‌ కేటాయించిన నిధులు శూన్యమన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి నేటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అసోసియేషన్‌ ప్రతినిధులు చిరంజీవి, ముర్కి రాజేందర్‌, పబ్బ రాజు, అయిత శ్రీనివాస్‌, చింత సత్యనారాయణ, ధన్‌పాల్‌ శ్రీనివాస్‌, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులతో అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

రాణంపల్లి క్యాంపు వద్ద బస్‌షెల్టర్‌ పునర్నిర్మించాలి



రుద్రూర్‌: మండలంలోని రాణంపల్లి క్యాంపు వద్ద బస్‌షెల్టర్‌ను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. రాణంపల్లి క్యాంపు, రాణంపల్లి గ్రామస్తులు కోటగిరి, రుద్రూర్‌ మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇక్కడే బస్సు కోసం వేచి ఉంటారు. రోడ్డు వెడల్పులో భాగంగా రోడ్డు ఎత్తు పెరగడం వల్ల ఇక్కడి బస్‌షెల్టర్‌ కుంగి పోయింది. వర్షం కురిసినపుడు షెల్టర్‌లోకి నీరు చేరి పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు రోడ్డు పక్కన ఎండలో, వానలో నిలబడాల్సి వస్తోంది. ప్రయాణికుల అవస్థలు గుర్తించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సర్కారు బడిలోనే చదివించండి



బాల్కొండ: సర్కారు బడిలోనే చదివించండి అంటూ బాల్కొండ, ముప్కాల్‌, మెండోరా మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆదివారం బడిబాట నిర్వహించారు. మెండోరా మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మహిళ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. సర్కార్‌ బడిలోనే నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని తెలిపారు.

కొనసాగుతున్న స్వచ్ఛ కార్యక్రమం



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని రామాలయంలో ఆర్మూర్‌ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సుంకే శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రజలు వారంలో ఏదో ఒక రోజు ఓ గంట పాటు తమ పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ పరిసరాలల్లో గల పిచ్చిమొక్కలను, మురికి కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. సభ్యులు జీడీ రాజ్‌ కుమార్‌, నిశాంత్‌, అంజనేయులు, గణేష్‌, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

రుద్రూర్‌: నేషనల్‌ మీన్స్‌ కం మెరిట్‌ స్కాలర్‌షిప్‌(ఎన్‌ఎంఎంఎస్‌)కు మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు వై.మానస, బి.అలేఖ్య ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. వీరికి ప్రతి ఏడాది రూ.12 వేల చొప్పున నాలుగేళ్లు స్కాలర్‌షిప్‌ పొందుతారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థినులను రైడ్‌ కమిటీ సభ్యులు అభినందించారు.

సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

సిరికొండ: ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌ పార్టీకి పెద్ద దిక్కయిన బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా నాయకులు బండారి నరేష్‌ డిమాండ్‌ చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఆయనకు చోటు కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో కాంగ్రెస్‌ పార్టీకి ఎంతో సేవ చేశారన్నారు. పదేళ్లు పార్టీ అధికారంలో లేకపోయినా పార్టీ కోసం, కార్యకర్తల కోసం అహర్నిశలు పాటుపడిన సుదర్శన్‌రెడ్డికి అధిష్టానం పునరాలోచించి తక్షణమే మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేయాలి



రుద్రూర్‌: మండల కేంద్రంలోని శ్రీ సార్వజనిక్‌ గణేష్‌ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే 75వ (వజ్రోత్సవ) వార్షికోత్సవంలో గ్రామస్తులు అందరు భాగస్వాములు కావాలని నిర్వాహక కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వేడుకలు వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు. ఇందుకు వివిధ కమిటీలు ఏర్పాటు చేశారు. సమావేశంలో గణేష్‌ మండలి అధ్యక్ష, కార్యదర్శులు చిదుర వీరేశం, గెంటీల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బాల్కొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మెండోరా బీజేపీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి అన్నారు. ఆదివారం బుస్సాపూర్‌లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆపరేషన్‌ సింధూర్‌ను విజయవంతం చేయడంపై మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండల ప్రభారి గంగా సాయన్న, మాజీ ఎంపీటీసీ నడ్పి సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

జీవిత భాగస్వాములను ఎంచుకోవడానికి ఒక చక్కటి వేదిక


మాట్లాడుతున్న దాసరి నర్సింలు


పేర్లు నమోదు చేసుకుంటున్న తల్లిదండ్రులు

నిజామాబాద్‌నాగారం : పరిచయవేదిక ఎంతో మందికి జీవిత భాగస్వాములను ఎంచుకోవడానికి ఒక చక్కటి అవకాశాన్ని కల్పించిందని అఖిల భారత పద్మశాలి సంఘం సెంట్రల్‌ బోర్డు సభ్యుడు, పద్మశాలి పరిచయ వేదిక అధ్యక్షుడు దాసరి నర్సింలు అన్నారు. ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్‌లో గల విజయలక్ష్మి గార్డెన్‌లో ఏడో పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఈ పరిచయ వేదికకు వధూవరుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. నిజామాబాద్‌ జిల్లాతో పాటు కామారెడ్డి, ఆదిలాబాద్‌, నిర్మల్‌, కరీంనగర్‌, సిద్దిపేట, మెదక్‌ జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో యువతీయువకులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మైసల నారాయణ, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ భీమర్తి రవి, కోశాధికారి దిండిగల్ల శంకర్‌, సంయుక్త కార్యదర్శులు భీమర్తి సురేందర్‌, గర్దాస్‌ శంకర్‌, ఉపాధ్యక్షులు అంకం జగదీష్‌, గాలిపల్లి నారాయణ, గెంట్యాల వెంకటేశ్‌, రాజేంద్రప్రసాద్‌, బూస శ్రీనివాస్‌, నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు పెంట దత్తాద్రి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరంలాంటిది


లబ్ధిదారులతో పీసీసీ డెలిగేట్‌ శేఖర్‌ గౌడ్‌


మెంట్రాజ్‌పల్లిలో .. డీసీసీ డెలిగేట్‌ ధర్మాగౌడ్‌


కొండాపూర్‌లో.. కాంగ్రెస్‌ నేతలు

- పీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌ గౌడ్‌

మోపాల్‌: సీఎం సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్‌) పేదలకు వరం లాంటిదని పీసీసీ డెలిగేట్‌, నిర్మల్‌ జిల్లా పరిశీలకులు బాడ్సి శేఖర్‌ గౌడ్‌ పేర్కొన్నారు. ఆదివారం బాడ్సి, సింగంపల్లి గ్రామాలకు చెందిన 18 మంది బాధిత కుటుంబాలకు సుమారు రూ.6 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌ గౌడ్‌ మాట్లాడుతూ.. వైద్యం ఖరీదైన నేపథ్యంలో అనారోగ్యాలకు గురైన పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, అందుకే ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్‌ ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచిందని గుర్తుచేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలోబాడ్సి సొసైటీ చైర్మన్‌ నిమ్మల మోహన్‌రెడ్డి, నాయకులు మల్లయ్య, రవి, జగదీష్‌రెడ్డి, కొండూరు దాస్‌, చాకలి లింగం, గూండ్ల పోశెట్టి, కాల్వోల్‌ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

మెంట్రాజ్‌పల్లిలో..

డిచ్‌పల్లి: ఎంతోమంది పేదలకు సీఎం సహాయనిధి వరంగా మారిందని డీసీసీ డెలిగేట్‌ ధర్మాగౌడ్‌ అన్నారు. మెంట్రాజ్‌పల్లిలో పది మందికి సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఆయన అందజేశారు. కాంగ్రెస్‌ గ్రామ శాఖ అధ్యక్షుడు సాయన్న, ఆనంద్‌, నరేందర్‌రెడ్డి, వినోద్‌, సుధీర్‌, అభి, శంకర్‌, రాకేష్‌, బాలు, బాబా, తదిదతరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో..

సిరికొండ: కొండాపూర్‌లో పలువురు బాధితులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను కాంగ్రెస్‌ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుచ్చన్న, నీరటి శ్రీధర్‌, ఆకుల జగన్‌, గౌసోద్దీన్‌, చంద్రాగౌడ్‌, ఫారూఖ్‌, బాలసాయిలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చేపలకు మహా డిమాండ్‌


డిచ్‌పల్లిలో చేపలు కొంటున్న ప్రజలు


సిరికొండలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


నల్లవెల్లిలో చేపల కోసం బారులు తీరిన ప్రజలు

డిచ్‌పల్లి: మిరుగు(మృగశిర కార్తె)ను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో చేపలకు మహా డిమాండ్‌ కనిపించింది. ప్రజలు చేపల కొనుగోలు కోసం మత్స్యకారుల వద్ద బారులు తీరారు. మిరుగు రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదనే నమ్మకం ఉంది. ఈ కార్తె మొదటి రోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మృగశిర కార్తె వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రైతులు తమ పంట పొలాల్లో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

ఇందల్వాయి : మండలంలోని గ్రామాల్లో చెరువుల వద్ద చేపలు కొనేందుకు ప్రజలు గంటల తరబడి వేచి చూశారు. గన్నారం, ఇందల్వాయి, సిర్నాపల్లి, నల్లవెల్లి, అన్సాన్‌పల్లి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం నుంచే చెరువుల వద్ద జనాల సందడి మొదలైంది.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌ శాఖ అధికారులు తెలిపారు. అంకాపూర్‌ నుంచి వచ్చే 33 కేవీ విద్యుత్‌ లైన్ల నిర్వహణలో భాగంగా రెండు గంటల పాటు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్‌	97,500	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్‌	90,002		

- నిజామాబాద్‌ బిజినెస్‌

మాంసం ధరలు

చికెన్‌	ధరలు (కిలోకు)	డ్రెస్డ్‌	180
		లైవ్‌	140
స్కిన్‌లెస్‌	200	మటన్‌	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్‌	రిటైల్‌		హోల్‌సేల్‌	రిటైల్‌
టమాట	18	30	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	50	70	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	80	130	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	60
వంకాయ	25	50	బీట్‌రూట్‌	25	50
పాలకూర	80	120	కరివేపాకు	40	60
మెంతికూర	100	140	చామగడ్డ	30	50
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	70
పుదీనా	70	100	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	90	మామిడికాయ	30	50

-సుభాష్‌నగర్‌

సినిమాలు

ఉషా ప్రసాద్‌ మల్టీప్లెక్స్‌ (గీతా ఏషియన్‌)
- స్క్రీన్‌-1 థగ్‌లైఫ్‌ -1.25,7.35, 10.40
- స్క్రీన్‌-2 శ్రీశ్రీశ్రీ రాజావారు-10.40, 4.40, 10.35 - భైరవం-1.40, 7.40
- స్క్రీన్‌-3 హౌస్‌ఫుల్‌-5(హిందీ)-10.30, 1.25, 4.30, 7.35, 10.40

పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (వేణు మాల్‌)
- స్క్రీన్‌-1 కరాటే కిడ్‌ లెజెండ్స్‌-11.00
- మిషన్‌ ఇంపాజిబుల్‌(ఇంగ్లీష్‌)-1.15
- భైరవం-4.45, 10.35
- భూల్‌ చుక్‌ మాఫ్‌(హిందీ)- 7.55
- స్క్రీన్‌-2 హౌస్‌ఫుల్‌-5(హిందీ)-9.40, 3.40, 7.10, 10.40
- ఫైనల్‌ డెస్టినేషన్‌ బ్లడ్‌లైన్స్‌-1.10
- స్క్రీన్‌-3 ఫైనల్‌ డెస్టినేషన్‌ బ్లడ్‌లైన్స్‌-11.30
- బద్మాషులు-2.00 ,థగ్‌లైఫ్‌-4.35, 10.40
- పాడేరు 12 మైలు-8.00
- స్క్రీన్‌-4 మిషన్‌ 007-11.05
- హౌస్‌ఫుల్‌-5బి(హిందీ)-1.40
- శ్రీశ్రీశ్రీ రాజావారు-5.10, 10.45
- ఫైనల్‌ డెస్టినేషన్‌ బ్లడ్‌లైన్స్‌-8.15

లలితామహల్‌ భైరవం దేవి శ్రీశ్రీశ్రీ రాజావారు


నటరాజ్‌ హౌస్‌ఫుల్‌-5(హిందీ) విజయ్‌ థగ్‌లైఫ్‌

బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి రాజబాబు


రాజబాబును సన్మానిస్తున్న దేవేందర్‌, తదితరులు

నిజామాబాద్‌ రూరల్‌: అడవి రాజబాబు వ్యాఖ్యాతగా, రంగస్థలం నటునిగా, రేడియో ప్రయోక్తగా, రచయితగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా విలువైన సేవలు అందించాడని, అడవి రాజబాబు స్వరం ఎంతో మాధుర్యమైనదని హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్‌ అన్నారు. ఆదివారం హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో జరిగిన ఆకాశవాణి వ్యాఖ్యాత అడవి రాజబాబు పదవీ విరమణ అభినందన సభలో ఆయన మాట్లాడారు. 1991–95 వరకు నిజామాబాద్‌ ఆకాశవాణి ఎఫ్‌ఎం కేంద్రంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ వంటి యువత, ఔత్సాహిక రచయితలు, కళాకారులకు అవకాశం కల్పించడంలో ముందున్నారన్నారు. రాజబాబును ఘనంగా సత్కరించారు. డి. గోపాల్‌, బట్టు దయానంద్‌, శంకర్‌ పాల్గొన్నారు.

సాహిత్యమే సమాజానికి నిజమైన దిక్సూచి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

నిజామాబాద్‌ రూరల్‌ : సాహిత్యమే సమాజానికి నిజమైన దిక్సూచని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) నిజామాబాద్‌ జిల్లా అధ్యక్షుడు బి.ప్రేమ్‌ లాల్‌ పేర్కొన్నారు. ఆదివారం ప్రముఖ కవి, రచయిత గఫూర్‌ శిక్షక్‌ రాసిన 'సమీక్ష వీక్షణం' పుస్తకాన్ని ఆదివారం నగరంలోని హరిచరణ్‌ మార్వాడి పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమీక్ష వీక్షణం పుస్తకంలో అనేక పుస్తకాల సమీక్షలు ఉన్నాయని అవన్నీ కూడా వివిధ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసే విధంగా రచయితలు చేసిన కృషికి నిదర్శనంగా ఉన్నాయన్నారు. తెలంగాణ రచయితల వేదిక ప్రజా గొంతుకగా నిలుస్తోందన్నారు. పుస్తక రచయిత గఫూర్‌ శిక్షక్‌ మాట్లాడుతూ..

29 పుస్తకాల సమీక్షలను ఈ పుస్తకంలో ఉంచడం జరిగిందని, తెలంగాణ ప్రాంతానికి సంబంధించి వివిధ పల్లెల జీవన విధానాన్ని తెలిపే అనేక పుస్తకాల సమీక్షలను సమస్యలను పరిష్కరించే దిశలో కవులు రాసిన పుస్తకాలు ఇందులో చేర్చినట్లు తెలిపారు. సమాజంలోని చెడును తొలగించి మంచిని పెంచే దిశలో మేలైన రచనలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ కవి మోహన్‌రాజ్‌, లింగం, సురేష్‌, శ్రీనివాస్‌, కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఇథనాల్‌ ఫ్యాక్టరీపై ఎందుకంత మమకారం

సిరికొండ: ప్రజలు ప్రతిఘటిస్తున్నా ఇథనాల్‌ ఫ్యాక్టరీపై ప్రభుత్వానికి ఎందుకంత మమకారమని సీపీఐఎంఎల్‌ మాస్‌లైన్‌ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్‌ సభ్యులు వి.ప్రభాకర్‌ ప్రశ్నించారు. మండలంలోని గడ్కోల్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో మాకు ఇథనాల్‌ ఫ్యాక్టరీ వద్దని స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండిగా అనుమతులు ఇచ్చి పరిశ్రమ ఏర్పాటుకు పూనుకోవడం, ఆందోళన చేస్తున్న స్థానికులపై కేసులు పెట్టి అరెస్ట్‌లకు పూనుకోవడం సిగ్గు చేటన్నారు. స్థానికులపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నాయకులు రామకృష్ణ, రమేష్‌, రాజేశ్వర్‌, కిషోర్‌, దామోదర్‌, సాయారెడ్డి, బాబన్న, లింబాద్రి, కిషోర్‌, రమేష్‌, అనీస్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకర్‌, పక్కన సీపీఐఎంఎల్‌ నాయకులు